# కడుపుమండితే

డా. మంతెన సూర్యనారాయణ రాజు





రోడ్డంతా సందడిగా ఉంది. సాయంకాలం సరదా రాయుళ్ళు ఆడవాళ్ళు వచ్చే పోయే సినిమా హాళ్ళకూడళ్ళ దగ్గర బీట్ సెంటర్లుగా చేసుకొని అవాకులూ చెవాకులూ వాగుతున్నారు. కొందరు ఆడవాళ్ళు ఆ పోకిరీ మేళాన్ని చూపులతో ఛీత్కరించుకోవడాలు, మరికొందరు తుపుక్కున ఉమ్మి, వాళ్ళకు అసహ్యాన్ని తెలియజేయడాలు, ఇంకొందరు చెప్పులు చూపడాలు జరుగుతోంది. సెంటర్లో బీట్ కానిస్టేబుల్ వచ్చేపోయే వాహనాలను, సైకిళ్ళను, జనాన్ని అదుపు చేయలేక సతమతమవుతున్నాడు. మధ్యమధ్య స్టాప్ బోర్డు తిరగేస్తున్నాడు. కొందరు అతగాడి అవస్థ చూసి విరగబడి నవ్వడమే కాకుండా రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. అవి అతని చెవినపడి అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

ఆరుగంటలయ్యేసరికే ఒక మహనీయుడు ఫుల్‌గా మందుకొట్టి అపర దేవదాసులు 'జగమేమాయ... బ... బ్రతుకేలోయ' అంటూ ఆ చిత్రం తాలూకు సముద్రాల వారి సాహిత్యాన్ని ఖూనీ చేస్తూ, ఘంటసాల వారి గానాన్ని కలుషితం చేస్తూ వాగుడు లాంటి పాట పాడుతున్నాడు. వస్తున్న లారీకి అడ్డంగా నిలబడి న్యూసెన్స్ చెయ్యసాగాడు. పాపం! కానిస్టేబుల్ ఖాదర్ అలీ అతగాడికి వినిపించేలా 'తప్పుకో!' అంటూ గట్టిగా అరిచాడు. అబ్బే! వాడికి ఆ కేక వినిపించినా చెవి కెక్కలేదు. ట్రాఫిక్ జామ్ అయిపోయింది. తప్పనిసరై తనే వెళ్ళి బెల్టు ఊడదీసి నాలుగు వాయించి వాణ్ణి పక్కకు నెట్టేసాడు. మళ్ళీ జాగ్రత్తగా సూచనలిస్తూ వాహనాల రాకపోకల్ని క్రమబద్ధం చేసి దార్లో పెట్టాడు.

ఎస్.ఐ. ఛాంబర్లేన్ అప్పుడే బుల్లెట్‌పై ప్రత్యక్షమయ్యాడు. తారుడబ్బాలాంటి శరీరమేమో, నల్లని ముఖంపై కొట్టుకొచ్చిన పౌడర్ ఆ నలుపులో ఇమడక బూడిద పూసుకున్నట్టుంది. ఖాదర్ అతనికి సెల్యూట్ కొట్టాడు. వెహికల్ పార్కింగ్ ప్లేస్‌లో పెట్టి పూలకొట్టు దగ్గరికెళ్ళాడు. చేమంతిపూల చెండొకటి పొట్లం కట్టి తెచ్చి పళ్ళికిలిస్తూ అతని బుల్లెట్ బాక్స్‌లో పెట్టి వెళ్ళిపోయాడు. ప్రక్కనున్న పండ్ల దుకాణం వాడు నాలుగు రకాల పళ్ళు పాలిథిన్ సంచిలో పెట్టి ఛాంబర్‌లేన్ బాక్సులో పెట్టి ఒక నమస్కారం చేసి అంగట్లో కెళ్ళి పళ్ళు అమ్ముకోవడంలో లీనమైపోయాడు.

ఖాదర్ అసహనంగా 'బాగుందిరా నీ వరస. వసూళ్ళు నీ వంతు. కాపలాలు నా వంతు. తినరా ఎన్నాళ్ళిలా అప్పనంగా తింటావో...' అంటూ సణుక్కున్నాడు. ఎస్.ఐ. పక్కనున్న బ్రాందీ కొట్లో దూరాడు. ఆ షాపు ఓనర్ సన్యాసిరావు సిగరెట్ ఆఫర్ చేస్తే దాన్ని తగలేసాడు. కాసేపు ఆ రోజు పేపర్ అటూ ఇటూ తిరగేసాడు. అనంతరం సన్యాసిరావు కొట్లో గుమస్తా ఓ.టి. బ్రాందీ క్వార్టర్ బాటిల్ అందించాడు. దాన్ని భద్రంగా పేంటు జేబులోకి తోసేశాడు. అది కూడా ఖాదర్ గమనించకపోలేదు.

అప్పుడే ఫోర్ట్వంటీ వెంకటరెడ్డి ఆదరాబాదరా సైకిల్ తొక్కుకుంటూ వచ్చి 'సార్‌గారెక్కడ?' అని అడిగాడు. ఖాదర్ కొట్టువైపు చూపించాడు. లోపలికెళ్ళి సెల్యూట్ కొట్టి 'సార్! సార్! ఘోరం జరిగిపోతోంది' అన్నాడు ఒగరుస్తూ. ముఖానికి పట్టిన చెమట కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ఫ్యాన్ కింద నిలబడ్డాడు. ఆయాసపడుతున్నాడు. 'ఏంటో? ఎక్కడో కాస్తంత అర్థమయ్యేలా సెప్పి తగలడు' అంటూ అతనిని చూస్తూ అడిగాడు ఛాంబర్‌లేన్. 'నా నోటితో నే సెప్పలేను. ఈ మధ్యన నేరం సెయ్యనోడు పాపి'

'తస్సరవలా! అంత జరక్కూడని పనేటయ్యా అది' అంటూ నోరెళ్ళబెట్టాడు ఎస్.ఐ.

'కాని పనంటూ అంత తాపీగా అడుగుతారెందుకండీ. అక్కడ కల్లు కొట్టు దగ్గర న్యూకాలనీలో దొమ్మీ జరుగుతుంటే సూళ్ళేక లగెట్టుకొచ్చి పడ్డా!' అంటూ ఆగాడు వెంకటరెడ్డి.

'ఎవురన్నా సచ్చిపొయ్యారా?' ఎస్.ఐ. ప్రశ్నించాడు.

'అదంతా సూళ్ళేకే తవురి దగ్గరకు గుండెలు గొక్కుంటొచ్చా!'

'ఇదండీ సన్యాసిరావుగారూ! మా డిపార్ట్‌మెంటోళ్ళ నిర్వాకం. ప్రెజల్ని కాపాడటం అటుంచి పెడ్డపేరు తీసుకొత్తున్నారనుకోండి. మా ఉజ్జోగాల్లో అసలు క్షణం తీరికుండదండీ. ఇంతకన్నా నే హేడ్డుగా ఉన్నప్పుడే హాయిగా కంటినిండా నిద్రా, కడుపునిండా బువ్వ తిని ఆనందంగా ఉండేవోణ్ణి! నడుస్తూ ఉండు' అంటూ లేచి నాలుగడుగులు వేశాడు.

సన్యాసిరావు కేష్ కౌంటర్ దగ్గర్నుంచి లేచి ఎస్.ఐ. ఛాంబర్లేన్ దగ్గరకొస్తూ 'ఎస్.ఐ.గారూ ఆ కొట్టు మా బామ్మర్ది పెంటయ్యదండీ. దీన్ని మీరు కొంచెం సూసీ సూడనట్టు వదిలెయ్యాలండి. ఆయ్! పైగా ఇది ఎక్సైజోళ్ళకి సంబంధించింది. మీ వెంకట్రెడ్డితో కూడా సెప్పండి. మరి నే నేపారం సూసుకుంటానండి' అంటూ తిరిగెళ్ళి తాను కౌంటర్‌లో కూర్చుండిపోయాడు సన్యాసి.

'అరే! అలాగా! ఇప్పుడెలా. వెంకట్రెడ్డి ఎళ్లిపోయాడు. ఈ మాట ముందే చెప్పాల్సింది. అయినా... ఆ ఇప్పుడేమైపోయింది గనక... అది ఎక్సైజ్ ఎస్సై సూసుకుంటాడ్లెండి. ఆడికి నే సెప్తా. మిగిలినది, మీరూ మేమూ సూసుకోవాల' అంటూ బుల్లెట్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

సినిమాలన్నీ మొదలయ్యాయి. జనం పల్చబడ్డారు. ఖాదర్ డ్యూటీ దిగుతుండగా వెంకటరెడ్డి మళ్ళీ కనిపిస్తే దగ్గరకెళ్ళాడు. 'హిందాకా హంత కంగారు వచ్చినావ్! హేమిటీ కత రెడ్డీ భాయ్' అంటూ ఆసక్తిగా అడిగాడు.

'ఆ! ఏముందీ అన్నీ మామూలే. తీసుకుంటే యాక్షన్... కేసవుద్ది. డబ్బులు మెక్కేస్తే రద్దవుద్ది. ఎవరికి తెలీని భాగోతమిది. సన్యాసిరావు బామ్మర్ది కొట్టు దగ్గర కొట్టుకు సత్తన్నారు. అది కూడా పాత రాజకీయపు కక్షలే లెద్దూ' అంటూ సైకిల్ ఎక్కేసాడు అతగాడు.

★ ★ ★

రెండు రోజులు గడిచాక కల్లు కొట్టు దగ్గర జరిగిన దొమ్మీలో కొట్టు తాలూకు పెంటయ్య మనుషులకు ఏ శిక్షా పడలేదు. కారణం ఛాంబర్లేన్ వాళ్ళకి ఏం జరగకుండా మేనేజ్ చేశాడు. ఎక్సైజ్ ఎస్.ఐ. సెలవు మీద ఉన్నాడు. అపోజిషన్ పార్టీ మనుషులే దెబ్బలు తిన్నవాళ్ళే జైలుపాలయ్యారు. ఇదంతా రాజకీయ కుట్ర అన్నారు పెద్దలు. పోలీసులు కూడా అధికార పార్టీ వ్యక్తులు చేసిన అక్రమాల్నే డబ్బులు మెక్కి సక్రమాలుగా నిరూపించారు. ఖాదర్ వలీ ఇవేం పట్టించుకోలేదు. నిజం తెలిసినా తను రంగంలో దిగి ఏం చేయలేని పరిస్థితి. స్థానికులు కలుగజేసుకోవడంతో ఆ గొడవ కోర్టు కెక్కింది. వాయిదాలతో కేసు నత్తనడక నడుస్తోంది.

ఆ రోజు రాత్రి ఖాదర్ వలీకి అతని అల్లుడు అర్జెంటుగా రమ్మని ఫోన్ చేశాడు. విషయం ఏమిటని అడిగితే నూర్జహాన్‌కి పురిటినొప్పులు ఎక్కువైతే ఆస్పత్రిలో చేర్పించాను. మిమ్మల్ని చూడాలని పట్టుబడుతోంది అంటూ సమాధానం చెప్పాడు. డ్యూటీ దిగిందే తడవుగా ఛాంబర్లేన్ కోసం అతని ఇంటికి పరిగెట్టాడు. అప్పటికే దొమ్మీకి కారకులైన సన్యాసిరావు బావమరిది పెంటయ్య మిగిలిన వాళ్ళతో బాటు మందు సేవిస్తూ ఎస్.ఐ ఆనందంతో తేలిపోతున్నాడు.

దగ్గర కెళ్ళి సెల్యూట్ కొట్టి 'సార్! రేపు, ఎల్లుండి మాకీ మీరు సెల్వ మంజూర్ సెయ్యాల' అంటూ అసలు విషయం అతని ముందుంచాడు. కైపెక్కిన కన్నులతో ఛాంబర్లేన్ ఊగిపోతూ 'ఇక్కడికెందుకొచ్చావు బే! స్టేషన్‌లో ఎరగవా!' అన్నాడు నిర్లక్ష్యంగా.

'అది కాద్ సార్! మా నూర్జహాన్ బేటీకి పురుటినొప్పుల్ హెక్కువై ఆస్పతాల్‌లో సేర్చినానరు. మా హల్లుడు అర్జెంటుగా రమ్మని ఫోన్ చేసినాడు'

'నీ కూతురు... కడుపు... కనలేక నొప్పులు పడుతోందా? చ్చు చ్చు! మైడియర్ ఫ్రెండూ! పాపం సూడండయ్యా. అది కంటోందంటే గాని నే సెలవు ఇవ్వనని ఈడి ఎదవాలోసన. స్కౌండ్రల్. గెటవుట్. రేపు మనూరు హెల్త్ మినిస్టర్ గారొస్తున్నారు. ఎవర్నీ వదిలేది లేదు. కావాలంటే ఆయనెల్లిపోయాక పెట్టుకో' అన్నాడు చాంబర్లేన్. 'అది కాద్ సార్! అప్పటిదాకా నా బిడ్డను సూడకుండా వుండటం?' అంటూ గద్గద స్వరంతో ఆగిపోయాడు.

'పోబే! పొమ్మంటుంటే నీగ్గాదూ' అంటూ గసిరాడు.

ఖాదర్ వలీకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన కుమార్తె నూర్జహాన్ స్మృతిపథంలో ప్రసవవేదన పడుతున్నట్లు కనిపించింది.

'హాయ్ అల్లా! నేనేం చెయ్యాలిప్పుడు' అంటూ వెనుతిరిగి వచ్చేశాడు. అనుకోకుండా ఛాంబర్లేన్ కీప్ సుబ్బలక్ష్మి గుర్తుకొచ్చింది. గత్యంతరం లేక ఆమె దగ్గరకు పరిగెట్టాడు. ఎవరి కోసమో ఎదురుచూస్తున్న సుబ్బలక్ష్మికి ఎర్రగా బుర్రగా బూరెల్లా వుబ్బిన బుగ్గలు గల ఖాదర్ వలీ కనిపించాడు. సాయిబుగారికి ఇన్నాళ్ళకి మా ఇంటివైపు గాలి మళ్ళిందేమో అనుకుంది. 'రండి ఖాదర్‌గారూ!' అంటూ అందరినీ ఆహ్వానించినట్లే ఆహ్వానించింది సాదరంగా.

లోనికి వెళ్ళకుండా ఖాదర్ గుమ్మం ముందే నిలబడి 'తల్లీ! మీకీ పాదాల్ మొక్కుతా. నాకీ కూతుర్ నీకూ తెల్సు. హామె పురిటినొప్పుల్ పడుతోందని కబుర్ సేసినాడు హల్లుడు. మా సాంబర్‌లేన్‌కి మీరు సెప్పి రేపట్కీ హెల్లుండికి నాకీ సెల్వ హిప్పించండి. మీకు వేల్‌వేల్ దండాలు' అంటూ అర్థించాడు. 'అదా సంగతి. అందుకొచ్చారన్నమాట. నా కోసం కాదన్నమాట' అంటూ లోనికి పోబోయింది సుబ్బలక్ష్మి.

'అమ్మా! నీకోసమైతే మరోసారి వస్తా! నా బిడ్డా సావు బతుకుల్ మధ్యా ఉంది. మీరు జల్దీగా మా సార్‌కి నచ్చ సెప్పి సెల్వ మంజూరు సేయిపియ్యాల' అన్నాడు.

'నా కోసం తర్వాత వత్తానంటున్నారుగా. అయితే మీ పనైపోయినట్టే. బేగీ ఆ కాయితం ఇలాగివ్వండి. రాంగానే సెబుతా' అంది సుబ్బలక్ష్మి ఖాదర్ వైపు ఓరచూపు విసురుతూ.

జేబులో కాగితం తీసి ఖాదర్ సుబ్బలక్ష్మి చేతిలో పెట్టి 'వస్తా తల్లీ! మర్చిపోకండి' అంటూ వెళ్ళిపోయాడు.

'అబ్బే! మర్చిపోను. మీరు మాత్రం అన్నమాట ప్రకారం మర్చిపోకుండా వస్తారుగా' అంది. ఖాదర్ మాట్లాడలేదు. వెనుతిరగలేదు. మౌనంగా వెళ్ళిపోయాడు.

★ ★ ★

మూడోరోజు సాయంకాలానికి గాని ఖాదర్ తిరిగి రాలేకపోయాడు. నాలుగోరోజు డ్యూటీలో జేరాడన్న మాటే గాని అతని మనసు మనస్సులో లేదు. ఏ విధంగానైనా ఛాంబర్లేన్ మీద పగ తీర్చుకోవాలి. తనకి ఫోన్ రాగానే బయల్దేరి ఉంటే తన బిడ్డ నూర్జహాన్ బతికి ఉండేది. డ్యూటీ దిగేటప్పటికి ఎస్.ఐ స్టేషన్‌లో లేడు. సుబ్బలక్ష్మి ఇంటి దగ్గరా లేడు. ఆరా తీస్తే పేకాట క్లబ్బు దగ్గరున్నట్లు రూఢిగా తెలిసింది. ట్రంకాల్ బుక్ చేసి పై నిఘా అధికార్లకు ఆ వార్త అందించాడు. వాళ్ళు ఆలస్యం చెయ్యకుండా వచ్చి ఛాంబర్లేన్‌ని అరెస్టు చేసి తీసుకుపోయారు. సస్పెండ్ చేశారు. అతగాడి అవినీతి, అక్రమాలు చాలావరకూ వెలుగులోకొచ్చాయి. ఖాదర్ వలీకి మాత్రం కూతురు దక్కకపోయినా హెడ్డుగా ప్రమోషన్ వచ్చింది.

★